క్లుప్తంగా

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహార ఆవశ్యతను వివరిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

వేపాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కర్రి యశోద, ఎంపీటీసీ గొంప తులసి కోరారు. బానాది గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పుట్టే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.

భూ సమస్యలకు సమగ్రసర్వేతో చెక్



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

మెరకముడిదాం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సమగ్ర భూసర్వేతో మీభూములు సురక్షితంగా ఉంటాయని యాడిక మాజీ సర్పంచ్ బొత్సమోహనరావు అన్నారు. గ్రామంలో ఇటీవల చేపట్టిన సమగ్ర భూసర్వేపై శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన రావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూముల రీసర్వే కార్యక్రమాం అమలు చేస్తోందన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యే పునాది



మాట్లాడుతున్న ఎంఈఓ రామారావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రాథమిక విద్యే విద్యార్థుల భవిష్యత్‌కు పునాది అని ఎంఈఓ పి.రామరావు అన్నారు. గరివిడి మండలం తాటిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆటపాటలతో పాటుగా చదువుల్లో రాణించాలన్నారు. క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి అనురాధ, తదితరులు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి పురోహితులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం సీతారాముల కల్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సతీమణి అనురాధ, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవానీ, సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఏఎంసీ డైరెక్టర్ పి.నారాయణమూర్తి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సచివాలయం అదనపు భవనం ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ భవానీ

గంట్యాడ: మండలంలోని పెదవేమలిలో సచివాలయం అదనపు భవనాన్ని సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవానీ శుక్రవారం ప్రారంభించారు. సుమారు రూ.2 లక్షల వ్యయంతో భవనాన్ని నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పి.నారాయణమూర్తి, సచివాలయ కార్యదర్శి ఎల్.తవుడు, డిజిటల్ అసిస్టెంట్ సంతోష్, ఎంఎస్‌కే నీలిమ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిద్దాం..

క్షయ వ్యాధిని తరిమేద్దాం..



వేపాడ: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

దత్తిరాజేరు: ఆరోగ్య సూత్రాలు పాటిద్దాం.. క్షయ వ్యాధిని సమాజం నుంచి తరిమేద్దామని కొత్తవలస పీహెచ్‌సీ డాక్టర్ సంతోషిరూప పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఇంగిలాపల్లిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'అవును మనం టీబీని జయించగలం' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు మాట్లాడుతూ దూమ పానం, మద్య పానం, గుట్కాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అన్నారు. క్షయవ్యాధి బారినపడిన వారికి ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు.

క్షయ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

వేపాడ: అవగాహన పెంచుకుందా.. క్షయవ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్సా విధానం, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను డాక్టర్ ఎ.ధరణి ప్రజలకు వివరించారు. రెండు వారాలకు పైగా దగ్గు, కఫంలో ఎర్రటి జీరలు ఉన్నట్లయితే వెంటనే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఏ అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన పంతం.. టీబీ అంతం

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మన పంతం ..టీబీ అంతం, టీబీ రహిత సమాజమే ధ్యేయం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సహాయకులు సత్యారావు, హెచ్‌వీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



గర్భిణి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

గంట్యాడ: గ్రామ సచివాలయాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించేలా చూడాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. మండలంలోని సిరిపురం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న గర్భిణుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. సమీపంలో ఉన్న గర్భిణులను పిలిపించి వారితో మాట్లాడారు. హెచ్‌బీ పరీక్షలు, పౌష్టికాహారం, బరువు, ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికలను పిలిపించి మధ్యాహ్న భోజనం నాణ్యత ఎలా ఉందని అడిగారు. కులధ్రువీకరణ పత్రాల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?ఎన్ని జారీ చేసారు అని డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రశ్నించగా.. 35 దరఖాస్తులు వచ్చాయని, 20 జారీ చేశామని సమాధానం ఇచ్చారు. మిగిలినవి కూడా త్వరితగతిన జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్ల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, సచివాలయ భవనాన్ని, వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంతకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి శీతల్ వర్మ, సీడీపీఓ డోకుల ఉమాభారతి, ఎంపీడీఓ వై.భవాని తదితరులు ఉన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



కంపోస్టు తయారీ వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జమ్ముపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కంపోస్టు తయారీని పరిశీలించారు. సేంద్రియ ఎరువును రైతులు వినియోగించేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం గుర్ల, దత్తిరాజేరు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు చెత్త సేకరణ, కంపోస్టు తయారీపై అధికారులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, జమ్ము స్వామినాయుడు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



పాలవలసలో పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి

చీపురుపల్లి రూరల్(గరివిడి): హిందూ దేవాలయాల పరిరక్షణలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయశాఖ నుంచి ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసిందని, ఇది ప్రభుత్వ గొప్పతనమని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మీ అన్నారు. గరివిడి మండలం కె.పాలవలసలో పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం, విపిరేగ పంచాయతీ విజయరాంపురం, మందిరవలస, దేవాడ గ్రామాల్లో రామాలయాల నిర్మాణానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆలయాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోందన్నారు. గ్రామ పెద్దలు ఆలయ నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ బమ్మిడి అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టం పరిశీలన



పంటనష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గజపతినగరం రూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలోని పిడిశీల, సీతారామపురం గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి తెలిపారు. ఆ రెండు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని పరిశీలించారు. నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఆమె వెంట వ్యవసాయశాఖ సిబ్బంది ఉదయసిరి, వీఆర్వో నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దత్తిరాజేరులో..



దత్తిరాజేరు: తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహరాజ్

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో గురువారం కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దయిన మొక్కజొన్న పంటను ఏడీఏ మహరాజన్, ఏఓ అనురాధ శుక్రవారం పరిశీలించారు. సుమారు 15 ఏకరాల్లో మొక్కజొన్న పంట పాడైనట్లు గుర్తించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. తడిచిన వెన్నులను ఎండలో ఆరబెట్టాలని సూచించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి రైతులకు పరిహారం అందేలా చూస్తామన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే..

- ఆర్‌డీఓ అప్పారావు



మాట్లాడుతున్న ఆర్‌డీఓ అప్పారావు

చీపురుపల్లి: సమాజంలో ఉండే వయోవృద్ధుల పోషణ బాధ్యత వారి వారసులదేనని, బాధ్యతను విస్మరించిన వారిని శిక్షించేందుకు చట్టాలు కూడా రూపొందించబడ్డాయని ఆర్‌డీఓ ఎం.అప్పారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధుల సంరక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం 2007 ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. హిందూ దత్తత, పోషణ చట్టం 1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి పిల్లలదేనన్నారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 125 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు చట్టమే వారి పోషణకు అయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తుందని స్పష్టం చేశారు. నిరాధరణకు గురైన వృద్ధుల పోషణ బాధ్యతను హెల్పేజ్ ఇండియా అనే సంస్థకు కేంద్ర ప్రభుత్వం అప్పగించిందన్నారు. హెల్పేజ్ ఇండియా సిబ్బంది అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ అధికారులు, పోలీస్ యంత్రాంగానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవడం పిల్లల బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం తదితరులు పాల్గొన్నారు.

రూ.5.76 లక్షలకు వేలం ఖరారు



జామి: వేలం నిర్వహిస్తున్న అధికారులు

జామి: మండల కేంద్రమైన జామి మేజర్ పంచాయతీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రోజువారీ మార్కెట్, వారపుసంత వేలంను స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈఓపీఆర్డీ ఐ.వి.లక్ష్మీ, సర్పంచ్ చిప్పాడ లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీదేవి, ఉపసర్పంచ్ అల్లు పద్మ సమక్షంలో వేలం నిర్వహించారు. రోజువారి మార్కెట్‌ను రూ.4.95 లక్షలకు, వారపుసంతను రూ.81 వేలకు బి.రాజు యాదవ్ దక్కించుకున్నాడు. మొత్తం రెండు రూ.5.76 లక్షలకు వేలం ఖరారు అయినట్లు ఈఓ శ్రీదేవి తెలిపారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: పురిటిపెంట పంచాయతీలో రోజువారీ మార్కెట్ వేలం పాటను సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ ఈఓ జానార్దనరావు శుక్రవారం నిర్వహించారు. మొత్తం 19 మంది వేలంలో పాల్గొనగా.. రేజేటి కూర్మారావు రూ.2.61 లక్షలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ మండల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మంత్రి నర్సింగరావు, రేగ సురేష్, జి.సన్యాసిరావు, అట్టాడ లక్ష్మునాయుడు, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళల రక్షణకు 'దిశ'



దిశ యాప్‌పై అవగాహణ కల్పిస్తున్న అధికారులు

బొండపల్లి: దిశ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో శుక్రవారం దిశ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం దిశచట్టాన్ని, దిశ యాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఆపద సమయంలో యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కడం ద్వారా పోలీసుల సాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చల్లంనాయుడు, ఎంపీడీఓ వేదవతి, బొండపల్లి, దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యులు ఝాన్సీ, ఎల్.సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

31న వాహనాల వేలం

గజపతినగరం: గజపతినగరం సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 31న వేలం వేయనున్నట్లు సీఐ ఎల్.అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. గజపతినగరం, బొండపల్లి, పెదమానాపురం, బూర్జివలస పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వివిధ వాహనాలను వేలం వేయనున్నట్లు చెప్పారు. టీవీఎస్ స్కూటీ, టీవీఎస్ ఎక్సెల్ 100, టీవీఎస్ మాక్స్ 4ఆర్, హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ తదితర వాహనాలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు సర్కిల్ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ



చెత్తశుద్ధిపై ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ, తదితరులు

చీపురుపల్లి: ఘన వ్యర్థాల నిర్వహణపై గ్రీన్‌అంబాసిడర్లు, పంచయతీల సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అన్నారు. మండలంలోని కర్లాం పంచాయతీ ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో చీపురుపల్లి మండలం నిమ్మలవలస, వంగర మండలం అరసాడ, కొప్పరవలస పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, గ్రీన్ అంబాసిడర్లకు చెత్తశుద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. తడి, పొడిచెత్త సేకరణ, తరలింపు, కంపోస్టు తయారీ, స్వచ్ఛభారత్ లక్ష్యాలపై జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బాణాన రామరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు బాణాన శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.

బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ సతీష్‌కుమార్

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సతీష్‌కుమార్‌కు కొత్తవలస టీబీ యూనిట్ బెస్ట్ మానటరింగ్ ఆఫీసర్ అవార్డు లభించింది. కొత్తవలస టీబీ యూనిట్ పరిధిలో వియ్యంపేట, లక్కవరపుకోట, వేపాడ, బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్షయవ్యాధి నివారణలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ఈ అవార్డు వరించింది. వరల్డ్ టీబీ డే సందర్భంగా రాష్ట్ర టీబీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, డీటీసీఓ రామేశ్వరి చేతులమీదుగా శుక్రవారం ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పీహెచ్‌సీ సిబ్బంది అభినందించారు. అలాగే బొద్దాం పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ స్రవంతి, పాటూరు ఆశా కార్యకర్త ద్వారపూడి వెంకటలక్ష్మిలకు బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డు దక్కింది.

సంక్షిప్తంగా...

రామాయణం నిత్య జీవితంలో భాగం

లక్కవరపుకోట: రామాయణం మన నిత్య జీవితంలో భాగమే అని శతావధాని బ్రహ్మశ్రీ తాతా సందీప్ శర్మ అన్నారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో శ్రీరామ వసంత నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం రాత్రి రామాయణంలో అరణ్యకాండ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. రామాయణం పవిత్రత, మన నిత్య జీవితంతో ఉన్న సంబంధాన్ని వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రవచనాలు ఆలకించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

గజపతినగరం: వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్సై గంగరాజు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం ఆటో డ్రైవర్లకు రోడ్డుభద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎండీయూ ఆపరేటర్ల నిరసన

శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించకుంటే వాహనాలు నిలిపేస్తామని ఎండీయూ వాహనాల ఆపరేటర్లు శుక్రవారం నిరసన తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఇన్సురెన్స్ మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తామని చెప్పిందని, కానీ బ్యాంక్ అధికారులు ఎండీయూ ఆపరేటర్ల నుంచి రూ.18 వేల నుంచి రూ.24 వేలు వరకు వసూలు చేశారని అన్నారు. వారు వసూలు చేసిన మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లించాలని కోరారు. అలాగే మృతి చెందిన ఎండీయూ ఆపరేటర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని, అంగన్‌వాడీలు, పాఠశాలలకు పంపిణీ చేసిన సరుకులకు సంబంధించి కమిషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. డిమాండ్లు పరిష్కరించకుంటే ఏప్రిల్ 1 నుంచి వాహనాలు నిలిపివేస్తామని హెచ్చరించారు.

అన్నపూర్ణ సత్రం భూముల లీజు ఖరారు

కొత్తవలస: మండల కేంద్రంలో అన్నపూర్ణ సత్రానికి చెందిన సర్వే నంబరు 10-66లో ఉన్న 770 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు గాను దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత ఆధ్వర్యంలో టెండర్ కమ్ వేలం పాటను శుక్రవారం నిర్వహించారు. ఈ వేలంలో మొత్తం 9 మంది పాల్గొనగా.. ముర్కూరు వెంకటప్పారావు ఏడాదికి రూ.2.40 లక్షలు లీజు చెల్లించేందుకు ముందుకురావడంతో అధికారులు ఆయనకు వేలాన్ని ఖరారు చేశారు. 11 సంవత్సరాలకు లీజు ఉంటుందని, ప్రతీ మూడేళ్లకు పాట మొత్తంలో 30 శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సర్వే నంబర్ 9-8లో 1.36 ఎకరాల భూమి లీజుకు సంబంధించి వేలం అనివార్య కారణాలతో వాయిదా వేశారు. వేలంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి కె.ఎల్.సుధారాణి, డీసీ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.విజయకుమార్, ఈఓ కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షలతో సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం

లక్కవరపుకోట: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో తాగునీటి బోరుల మరమ్మతులకు సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం చేపట్టినట్లు ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన క్రాస్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి బోరుల మరమ్మతులకు రూ.4.50 లక్షలతో సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం ప్రారంభించినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పైడిరాజు మాట్లాడుతూ.. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 42 రక్షిత మంచినీటి పథకాలు, 25 డైరెక్ట్ పంపింగ్ సిస్టం, 711 చేతిపంపు బోర్లు ఉన్నాయన్నారు. వాటి నిర్వహణకు రూ.4.50 లక్షలతో మెటీరియల్‌ను కొనుగోలు చేశామన్నారు. నేటి నుంచి మే 9వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో బోర్ల నిర్వహణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రూపేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ యు.చంద్రకళ, మాజీ సర్పంచ్ జామి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

గజపతినగరం: మేజర్ పంచాయతీ పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సర్పంచ్ కొండమ్మ, పంచాయతీ సెక్రటరీ రమణ శుక్రవారం భూమిపూజ చేశారు. ఇటీవల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా షాపులు కోల్పోయిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీ పరిధిలో స్థలా న్ని కేటాయించడం జరిగిందన్నారు. లబ్ధిదారు లు వారికి కేటాయించిన స్థలాల్లో షాపుల నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు చెప్పారు.